పల్లె వాకిట కోలాటం

- అంతరిస్తున్న సంప్రదాయ విద్యకు అంకురం
- అనంతపల్లిలో ఉత్సాహంగా నేర్చిన 40 మంది మహిళలు
- శ్రీసీతారామ మందిరం వద్ద గజ్జెపూజ, ప్రదర్శన


కోలాట ప్రదర్శనలో పాల్గొన్న మహిళలు

నల్లజర్ల: రెండు కర్రలు చేతబట్టి పదం పాడుతూ గుండ్రంగా తిరుగుతూ చేసే కోలాటాలు గతంలో ప్రతి పల్లెలో కనిపించేవి. రాను రాను ఆ కళ తెర మరుగవుతోంది. హిందూ ధార్మికతను బతికించాలని కొందరు మహిళలు మళ్లీ ఆ కళకు జీవం పోస్తున్నారు. ఆరోగ్యాన్ని, మానసిక ఉల్లాసాన్ని సంప్రదాయ కోలాట నృత్యాన్ని రెండు మాసాలుగా కవులూరుకు చెందిన భేతిన రాంబాబు పర్యవేక్షణలో శ్రీకోదండరామ భజన మండలిగా ఏర్పడి ఉత్సాహంగా ఆ మహిళలు నేర్చుకున్నారు. ఇటీవల గురువు రాంబాబు ఆధ్వర్యంలో గజ్జెపూజ చేసి స్థానిక విశ్వేశ్వర సీతారామ మందిరం వద్ద కోలాటాన్ని ప్రదర్శించారు. తిరుమల తిరుపతి దేవస్థానం దాససాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో గురువు రాంబాబు వారికి ఈ శిక్షణ ఇచ్చారు. ఈ కోలాటంలో బిందె, హారతి, శ్రీకృష్ణుడు, పాము మెలికలతో మెలి తిరిగి 25 రకాల నృత్య రీతులను ఇక్కడ ప్రదర్శించారు. ఇప్పటి వరకు శిక్షణ పొందిన వీరంతా త్వరలో తిరుపతిలో జరిగే మెట్ల ఉత్సవానికి పురందర దాసు ఆరాధనోత్సవం, తిరుచానూరులో జరిగే అమ్మవారి బ్రహ్మోత్సవాలలో తాము పాల్గొననున్నట్టు ఈ బృందంలో సభ్యురాలు వల్లాల సుధారాణి, శెట్టిపల్లి గణేశ్వరీ, గౌరి, మల్లికా, సుబ్బలక్ష్మి, పెద్దింట్లు వివరించారు. గ్రామస్తులు విశేష సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని తిలకించారు.

మానసిక, శారీరక ఉల్లాసం



రెండు నెలలుగా కోలాటాన్ని సాధన చేశాం. ఈ రెండు నెలలు శారీరకంగా, మానసికంగా ఉల్లాసంగా అనిపించింది. దీనివల్ల రోజంతా ఉత్సాహంగా ఉంటుంది. బృందంలోని సభ్యులతో కలసి కోలాటం ప్రదర్శించడం వల్ల వత్తిడి దూరం అవుతుంది. ప్రదర్శన సమయంలో స్థానికుల ప్రోత్సాహం బాగా ఉంటుంది. ఈ కళను భవిష్యత్తులోనూ కొనసాగించి భావితరాల వారు నేర్చుకునేలా కృషి చేస్తా. కోలాటం ద్వారా మన సంస్కృతి పరిరక్షణకు అవకాశం ఉంది.

– శెట్టిపల్లి గణేశ్వరి, భజన బృందం సభ్యురాలు,అనంతపల్లి

పూర్వ వైభవానికి కృషి



సంప్రదాయ కళ కోలాట భజనకు పూర్వ వైభవం రావాలి. దీనికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. ఖాళీ సమయాలలో మహిళలు సెల్‌ఫోన్లకు, టీవీలకు అతుక్కుపోతున్నారు. ఆధ్యాత్మికత వైపు దృష్టి మరల్చడానికి కోలాటం ఎంతో ఉపయోగపడుతుంది. ఇటువంటి కళలవైపు పిల్లల దృష్టి మర్చేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలి.

– అడబాల ధనలక్ష్మి, భజనమండలి సభ్యురాలు, అనంతపల్లి

గ్రామాల్లో కలెక్టర్ విస్తృత పర్యటన


బ్రాహ్మణగూడెంలో సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి


ఊనగట్లలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో మందులను తనిఖీ చేస్తున్న కలెక్టర్

చాగల్లు: ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు, ఆరోగ్య సేవలు అందించడంలో క్షేత్ర స్థాయిలో సిబ్బంది బాధ్యతగా ఉండాలని నిర్వహించాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. గురువారం సాయంత్రం ఆమె ఊనగట్ల గ్రామంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం తనిఖీ చేశారు. అనంతరం బ్రాహ్మణ గూడెం గ్రామంలో రీ సర్వే తీరు, గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం ద్వారా గ్రామ స్థాయిలో మరింత సమర్థవంతంగా వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలన్నారు. ప్రతిరోజూ ఆసుపత్రి కి వచ్చే రోగుల వివరాలను, రికార్డులను పరిశీలించి వైద్య సిబ్బందికి తగిన సూచనలను చేశారు. అనంతరం అక్కడ నుంచి బ్రాహ్మణ గూడెంలో కలెక్టర్ ప్రశాంతి రీ సర్వే పనులని పరిశీలించి, రైతులతో మాట్లాడారు. రీ సర్వే కోసం క్షేత్ర స్థాయిలో అధికారులు, సిబ్బంది పాల్గొనే సమయంలో భూ యజమానులు, రైతులు సహకరించాలని సూచించారు. ప్రజలకు సేవలందించేందుకు మన మిత్రా యాప్ 95523 00009 వాట్సాప్ గవర్నెన్స్ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చామని, దీనిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని, తద్వారా ప్రస్తుతం 161 పౌర సేవలు అందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రశాంతి పేర్కొన్నారు. సచివాలయం పరిధిలో చేపడుతున్న వివిధ రీ సర్వే డేటా వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాణీసుస్మిత, జిల్లా సర్వే అధికారి బి.లక్ష్మీనారాయణ, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డా. పి.కోమల, తహసీల్దార్ ఎం.మెరికమ్మ, జిల్లా సర్వైవల్ అధికారి డా.టి.రాజీవ్, టి.వెంకటేశ్వరరావు, ఎంపీడీవో ఆర్.శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శులు సుబ్బలక్ష్మి, వల్లి, వీఆర్వో రామకృష్ణ, సర్వేయర్లు, ఎంఎల్ హెచ్‌పీ ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కౌరును కలసిన మాజీ మంత్రి వనిత


నౌడూరులో ఎమ్మెల్సీ శ్రీనివాస్‌ను కలిసిన మాజీ మంత్రి వనిత, నియోజకవర్గ పార్టీ నాయకులు

దేవరపల్లి: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, ఎమ్మెల్సీ కౌరు శ్రీనివాస్‌ను మాజీ హోం మంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, గోపాలపురం నియోజకవర్గ సమన్వయకర్త తానేటి వనిత గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. గోపాలపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన పార్టీ ముఖ్య నాయకులతో పశ్చిమ గోదావరి జిల్లా నౌడూరుకు తరలి వెళ్లి కౌరు శ్రీనివాస్‌ను కలిసి పలు విషయాలను చర్చించారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలు పడుతున్న ఇబ్బందులు, గోపాలపురం నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలను ఎమ్మెల్సీ కౌరు శ్రీనివాస్‌కు వివరించి ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లాలని కోరారు. గోపాలపురం ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షులు సాలి వేణు, గోపాలపురం, నల్లజర్ల మండలాల పార్టీ అధ్యక్షులు వెలగా శ్రీరామూర్తి, వెల్లంకి సుబ్రహమణ్యం, నియోజకవర్గ ఎస్సీ విభాగం కన్వీనర్ కాకులపాటి శ్రీను, మాజీ జెడ్పీటీసీ సభ్యులు బంకా అప్పారావు, పార్టీ వివిధ విభాగాల నాయకులు కూసం రామ్మోహన్‌రెడ్డి, బొండాడ వెంకన్నబాబు, గుర్రాల లక్ష్మణ్, పెద్దిరెడ్డి జ్యోతిశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమానికి రూ.లక్ష విరాళం


దాత రామకుమారిని సత్కరిస్తున్న నిర్వాహకులు

దేవరపల్లి: గొల్లగూడెం సమీపంలోని లగడపాటి రామలక్ష్మమ్మ, రామనాయుడు వృద్ధుల, దివ్యాంగుల ఆశ్రమానికి దేవరపల్లికి చెందిన నున్న రామారావు కుమార్తె బొల్లిన రామకుమారి (హైదరాబాద్) రూ.1 లక్ష విరాళం అందజేశారు. ఈ విషయాన్ని ఆశ్రమ వ్యవస్థాపక చైర్మన్ కాగిత భాస్కరరావు గురువారం తెలిపారు. ఈ విరాళంతో రామకుమారి తండ్రి రామారావు జ్ఞాపకార్థం గది నిర్మిస్తామన్నారు. ఈ సందర్భంగా దాత రామకుమారిని సత్కరించి, జ్ఞాపిక అందజేశారు.

గుడ్ ఫ్రైడేకి సిద్ధం


క్రీస్తును శిలువ వేసే సన్నివేశాన్ని ప్రదర్శిస్తున్న క్రైస్తవులు (ఫైల్)

నిడదవోలు: ఆధ్యాత్మికమైన గుడ్ ఫ్రైడే పండగను నిర్వహించడానికి కొవ్వూరు డివిజన్ పరిధిలోని నిడదవోలు, కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గాల్లో క్రైస్తవులు సిద్ధమయ్యారు. మానవాళి పాప విముక్తి కోసం ఏసు ప్రభువు సిలువలో మరణించి నిత్యజీవాన్ని అనుగ్రహించిన అద్భుతమైన రోజు శుభ శుక్రవారం అందుకే ఈ రోజును శుభ శుక్రవారం, మంచి శుక్రవారం, గుడ్ ఫ్రైడేగా పిలుస్తారు. ఈ రోజు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసి క్రీస్తును శిలువ వేసిన విధానాన్ని అనుసరిస్తూ బహిరంగ సిలువ మార్గం నిర్వహిస్తారు. క్రైస్తవ విశ్వాసులు రోజంతా ఉపవాసంతో ఆరాధన చేసి ప్రార్థనలు చేస్తారు. ఏసుక్రీస్తును అనుసరించే వారి కోసం పరలోక ద్వారాలు తెరుచుకుంటాయని విశ్వాసుల నమ్మకం. ఏసుప్రభువు సిలువ మరణం పొంది మళ్లీ తిరిగి మూడో రోజున పునరుద్ధారణం పొందుతారు. ఈ రోజునే క్రైస్తవులు ఈస్టర్ పండుగగా జరుపుకొంటారు. ఆరోజు సమాధుల వద్ద తెల్లవారు జామున కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. మృతి చెందిన బంధువులను స్మరించుకుంటారు. పట్టణంలోని సెంటినరీ కృపాధార లూథరన్ చర్చి, రాయపేటలో ఉన్న మెంటే సుందరరావు మెమోరియల్ సెయింట్ జాన్స్ టౌన్ లూథరన్ చర్చి, ఆర్‌సీఎం, ప్రార్థన మందిరం, జీడీఎం, జీవంగల దేవుని సంఘం, వివిధ క్రైస్తవ ప్రారధనా మందిరాల్లో గుడ్ ఫ్రైడేకు ప్రత్యేక ఆరాధన కూడికలు నిర్వహించడానికి సంఘ కాపరులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఘనంగా మాంటిస్సోరీ స్కూల్ వార్షికోత్సవం


ఎస్సైని సత్కరిస్తున్న కరస్పాండెంట్ వీవీ అనీష్

తాళ్లపూడి: స్థానిక మాంటిస్సోరీ హైస్కూల్ 23వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో భారీ సెట్టింగ్‌లతో, ఎల్ఈడీ వెలుగుల్లో వేడుకలు కనువిందుగా జరిగాయి. ముందుగా కరస్పాండెంట్ వీవీ అనీష్ పాఠశాల విశేషాలను ప్రగతి నివేదికను వివరించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను జ్ఞాపికలు అందజేసి, సత్కరించారు. ఎస్సై టి.రామకృష్ణ మాట్లాడుతూ కష్టపడి ప్రణాళికాబద్ధంగా చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆశా అనిష్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నపాటి జాగ్రత్తలు పాటించాలి


మాక్‌డ్రిల్‌తో మంటలను అదుపు చేసే విధానాన్ని ప్రదర్శిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

నిడదవోలు: అగ్ని ప్రమాదాలు జరగకుండా చిన్నపాటి జాగ్రత్తలు పాటిస్తే ప్రాణ, ఆస్తి నష్టాల నుంచి బయటపడవచ్చునని జిల్లా అసిస్టెంట్ అగ్నిమాపకాధికారి కె. శ్రీనివాసరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు గురు వారం మండలంలోని గోపవరం పీపుల్స్ ట్రీ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో అగ్నిప్రమాదాలపై తీసుకోవాల్సిన చర్యలపై అగ్ని నిరోధక పరికరాలను ఉపయోగించి మంటలను ఆర్పే విధానాన్ని మాక్‌డ్రిల్ ద్వారా ప్రదర్శించారు. అగ్ని ప్రమాదాల నివారణ చర్యలపై ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు.

నిడదవోలు రూరల్: ప్రతి ఒక్కరూ అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని నిడదవోలు అగ్నిమాపకాధికారి శ్రీనివాసరావు సూచించారు. గోపవరం పీపుల్ ట్రీ ప్రైవేటు పాఠశాలలో అగ్నిప్రమాదాల నివారణపై విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ పరికరాల వినియోగం తదితర అంశాలపై వివరించారు. ఫైర్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చాగల్లు: డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌పై మూడు రోజుల శిక్షణ కార్యక్రమం గురువారంతో ముగిసింది. చాగల్లులో రైతు భరోసా కేంద్రం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో అగ్నిప్రమాదాల నివారణ, ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి అగ్నిమాపక దళ అధికారులు వివరించారు. ముఖ్యంగా వేసవిలో అగ్నిప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తాయని, అప్పుడు తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలను ప్రయోగపూర్వకంగా వివరించారు. తహసీల్దార్ ఎం.మెరికమ్మ, ఎంపీడీవో ఆర్.శ్రీదేవి, అధికారులు, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొవ్వూరు: అగ్ని ప్రమాదాల నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి గురువారం అగ్ని మాపక శాఖ అధికారులు పట్టణంలోని నారాయణ హైస్కూలులో విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. అగ్ని మాపక శాఖాధికారి ఏవీఎస్ఎస్ఎస్ వేణు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి


సయ్యద్ మునాఫ్

నల్లజర్ల: ముస్లింల మనోభావాలను దెబ్బతీసేలా కేంద్ర ప్రభుత్వం ఇటీవల తయారు చేసిన వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని వైఎస్సార్ సీపీ మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు మహమ్మద్ సయ్యద్ మునాఫ్ అన్నారు. ఆయన గురువారం నల్లజర్లలో విలేకర్లతో మాట్లాడారు. మైనార్టీ హక్కులకు భంగం కలిగేలా, రాజ్యాంగ విరుద్ధం ఈ చట్టం ఉందన్నారు. వైఎస్సార్ సీపీ సుప్రీంకోర్టులో ఈ చట్టాన్ని సవాల్ చేసిన సంగతిని గుర్తు చేశారు. కొన్ని శతాబ్దాలుగా ఉన్న మసీదులు, ముస్లిం శ్మశాన వాటికలు, దర్గాలు, ముస్లిం మత ప్రదేశాలన్నీ ఎలాంటి డీడ్స్ లేకపోయినా వక్ఫ్ బోర్డు పరిధిలో కొనసాగుతూ వక్ఫ్ ఆస్తులుగానే ఉన్నాయన్నారు. నూతన చట్టం ప్రకారం వాటన్నింటిపైనా బోర్డుకున్న హక్కు తొలగిపోతుందన్నారు. దీంతో లెక్కలేనన్ని చారిత్రక, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా ఉన్న ప్రదేశాలను కోల్పోవాల్సి ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన వక్ఫ్ చట్టంలో సీఈఓగా ముస్లిం వ్యక్తే ఉండాలన్న నిబంధన తొలగించడంతో పాటు సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్, వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరకులకు అవకాశం కల్పిస్తారన్నారు. ఇవన్నీ తమ హక్కులకు భంగం కలిగించడంతో పాటు మతసామరస్యాన్ని దెబ్బతీసే విధంగా ఉందన్నారు.

దుస్తుల పంపిణీ


దుస్తులు పంపిణీ చేస్తున్న మానవత కార్యదర్శి కీర్తి కుమార్

గోపాలపురం: మండల మానవత స్వచ్ఛంద సంస్థ చేపడుతున్న పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అభినందనీయమని సర్పంచ్ గొల్ల కుమార్ అన్నారు. మండలంలోని వేళ్లచింతలగూడెంలో మండల మానవత కార్యదర్శి కె.కీర్తికుమార్ ఆర్థిక సౌజన్యంతో ఏర్పాటు చేసిన దుస్తులను గురువారం వృద్ధులు, వికలాంగులు, అనాథలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల మానవత అధ్యక్షుడు పి.సత్యకృష్ణారెడ్డి, సీఆర్పీ కొయ్య నాగరాజు మానవత సభ్యులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి


వెంకటాయపాలెంలో సత్కారం అందుకుంటున్న రైతులు

గోపాలపురం: ప్రకృతి వ్యవసాయంపై రైతులు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ కె.శ్రీనివాస్ అన్నారు. వెంకటాయపాలెంలో గురువారం నవధాన్యాలు, వాటి ఉపయోగాలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రైతులు తమకున్న పొలంలో కొంత మేరకు ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయన్నారు. పెరుగుతున్న కాలుష్యం నేపథ్యంలో ఆరోగ్యాన్ని పెంపొందించడానికి రైతులు ప్రకృతి వ్యవసాయంపై మక్కువ పెంచుకోవాలని సూచించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం చేపట్టిన రైతులు కాండ్రేగుల సూర్యారావు, మిద్దే చెల్లారావును సత్కరించారు. సర్పంచ్ మేకా సత్తిబాబు, ఉప సర్పంచ్ వడ్లమూడి రాజేంద్ర ప్రసాద్, వీపీఏ వీరమల్లు ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

నల్లజర్ల: ఎస్సీ కార్పొరేషన్ కార్యాచరణ ప్రణాళిక 2024–25 సంవత్సరానికి మండల పరిషత్ ద్వారా అందించే రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ సింహాద్రి తెలిపారు. ఓబీఎంఎంఎస్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 21 నుంచి 50సంవత్సరాల వారు అర్హులన్నారు. మే 10లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఆధార్‌కార్డుకు లింకైన ఫోన్‌నంబరు, రేషన్ కార్డు, కులం, ఆదాయ ధ్రువపత్రం, రవాణాకు సంబంధించిన డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలన్నారు.

తాళ్లపూడి: ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 2024–2025 సంవత్సరానికి గాను సబ్సిడీ రుణాల మంజూరుకు అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తాళ్లపూడి ఎంపీడీవో టీబీ వెంకటరమణ పేర్కొన్నారు. మే 15 వరకు ఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తూ చేసుకోవాలని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఫార్మసీ, రవాణా రంగాలకు చెంది దరఖాస్తు చేయ దలిస్తే డ్రైవింగ్ లైసెన్స్, ఫార్మసీ సర్టిఫికెట్ కలిగి ఉండాలని, ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు కలిగి 21 నుంచి 50 సంవత్సరాలు లోపు బీపీఎల్ కేటగిరి వారై ఉన్నవాళ్లు అర్హులని తెలిపారు. ఆధార్, రేషన్ కార్డులతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని పేర్కొన్నారు.

ఆందోళనలో ఆరోగ్య మందిర్ ఉద్యోగులు


నల్లజర్లలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఎదుట ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

నల్లజర్ల: గ్రామీణ ప్రాంతాల్లోని ఆయూష్మాన్ ఆరోగ్య మందిరాల్లోని కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్లు, మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్స్ పరిస్థితి దయనీయంగా ఉంది. ఈ నేపథ్యంలో ఏపీ మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవెడర్స్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు గురువారం నల్లజర్ల ప్రాథమిక ఆరోగ్యం ఎదుట నిరసన ప్రదర్శన చేశారు. ఆయుష్మాన్ భారత్ నిబంధనల మేరకు ఆరేళ్లుగా గ్రామీణ ప్రాంతాలలో పనిచేస్తున్న తమను తక్షణమే క్రమబద్ధీకరించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులతో సమానంగా 23శాతం వేతన సవరణ చేయాలని కోరారు. గత రెండేళ్లుగా ఉద్యోగులకు వేతనాలు చెల్లించే విధానంపై తీవ్ర నిరాశ ఎదుర్కొంటున్నారని, జీతంతో పాటు ఇన్సెంటివ్‌లు ఎటువంటి కోతలు లేకుండా ఇవ్వాలని, జాబ్‌చార్ట్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. 19న జిల్లా స్థాయిలోను, 21న పోస్టుకార్డు, వాట్సాప్, టెలిగ్రామ్‌ల ద్వారా తమ సమస్యలను ప్రభుత్వానికి తెలియజేస్తామన్నారు. 22న జిల్లా కేంద్రాలలో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు జీవివి ప్రసాద్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు కె.సాహిత్య, కె.సాయినాథ్, ఎస్.వాసవి, పి.మణి, కె.దీప్తి, షేక్ జరీనా, కె.వెంకటలక్ష్మి, శ్రీలేఖ పాల్గొన్నారు.

గ్రామ స్థాయి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల ఆందోళన


అన్నదేవరపేట పీహెచ్‌సీ వద్ద ఆందోళన చేస్తున్న హెల్త్ వర్కర్లు

తాళ్లపూడి: గ్రామ స్థాయి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లుగా గత ఆరేళ్లుగా పని చేస్తున్న తమ ను రెగ్యులైజ్ చేయాలని ఎంఎల్ హెచ్‌పీ సిబ్బంది డిమాండ్ చేశారు. అన్నదేవరపేట పీహెచ్‌సీ వద్ద గురువారం ఎంఎల్ హెచ్‌పీ సిబ్బంది ఆందోళన చేశారు. ఒకే చోట కలిసి పని చేసే ఎంఎల్ హెచ్‌పీలకు, నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేసే ఇతర కేడర్ ఉద్యోగులకు జీత భత్యాలు విషయంలో 23 శాతం పెంచి చెల్లిస్తోందని, కానీ తమను మాత్రం మినహాయించారని అన్నారు. తమ సమస్యలను రాష్ట్ర, జిల్లా అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పరిష్కారంలేదని, తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ హెచ్‌పీ సిబ్బంది నవీన్, కుసుమ, స్వరూప, సౌజన్య, రమ్య, లిసి, అరుణ, రమాదేవి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగు లాభదాయకం

శాస్త్రవేత్త నరసింహారావు


పశివేదలలో నిర్వహించిన సదస్సులో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

కొవ్వూరు: రైతులు రబీ, ఖరీఫ్ వరి పంట సాగు తర్వాత రాగి, కొర్ర వంటి చిరుధాన్యాల పంటలు వేసుకుంటే లాభదాయకమని ఏరువాక శాస్త్రవేత్త డాక్టర్ నరసింహారావు సూచించారు. పశివేదల గ్రామంలో గురువారం రైతులకు చిరుధాన్య పంటల సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరు ధాన్యాల సాగుకి పెట్టుబడి వ్యయం తక్కువని, చీడపీడల తాకిడి ఉండదన్నారు. పోషక విలువలుంటే చిరుధాన్యపు పంటను ఉత్పత్తి చేసుకోవడం ద్వారా రైతుల లాభాలు పొందవచ్చునని సూచించారు. ప్రధాన శాస్త్రవేత్త మానుకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ తక్కువ తడులు, ఎరువులతో ఆరోగ్యవంతమైన పంటను తీసుకోవచ్చునన్నారు. తొలిదశలో కలుపు నివారణ, సమతుల్యమైన ఎరువులు వాడుతూ కేవలం రెండు,మూడు తడులతో పంటను తీసుకోవచ్చు అన్నారు. కేవలం 75–85 రోజుల్లోనే వేసవి పంటగా పండిస్తే ఎకరాకు నికరాదాయం రూ.20వేలు వరకు పొందవచ్చునన్నారు. మండల వ్యవసాయ శాఖాధికారి ఎ.గంగాధరరావు మాట్లాడుతూ జిల్లాలో రాగి, కొర్రలు వంటి పంటలపై రైతుల్లో అవగాహన కల్పించి పోత్సహిస్తున్నామన్నారు. చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెంచే దిశగా రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తున్నామన్నారు.

ప్రభుత్వ పాఠశాలలు ముద్దు


బడిబాటలో భాగంగా వాదాలకుంటలో మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

గోపాలపురం: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యను అందిస్తున్నామని ప్రయివేటు పాఠశాలలకు వెళ్లకుండా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని మండల విద్యాశాఖ అధికారి జి.శ్రీనివాసరావు అన్నారు. గోపాలపురం మండలం వాదాలకుంట గ్రామంలో గురువారం బడిబాట ర్యాలీ అనంతరం మానవహారం నిర్వహించి తల్లితండ్రులకు అవగాహన కల్పించారు. ఎంఈఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను వివరించారు. ప్రతి విద్యార్థి తల్లితండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని సూచించారు. ఉపాధ్యాయులు కె మేరీ సుశీల, సత్యరమేష్, చాపల బాలు మహేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు క్యాంపస్ ఇంటర్వ్యూలు

కొవ్వూరు: పట్టణంలో ఏబీఎన్ అండ్ పీఆర్ఆర్ కళాశాలలో శుక్రవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రామ్మోహన్ తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరంలో బీఎస్సీ రసాయన శాస్త్రం, 2021–2025 మధ్య బీఫార్మసీ సబ్జెక్టుల్లోను ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులను ఇంటర్వ్యూలకు ఆహ్వానిస్తున్నామన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు రెండు పాసు పోర్టు సైజు ఫొటోలు, బయోడేటా, అర్హత కలిగిన ధ్రువీకరణ పత్రాలతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ఆయన సూచించారు. ఉదయం 9.30 గంటల నుంచి ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు.

అసంతృప్తి సహజం

నిడదవోలు: పార్టీ అన్నాక కొంత అసంతృప్తి ఉంటుందని, అంతమాత్రాన కూటమిలో చిచ్చు రేగిందనడం హాస్యాస్పదమని జనసేన సమన్వయ కమిటీ సభ్యుడు పాలా వీరాస్వామి, పట్టణ అధ్యక్షుడు రంగా రమేష్ తదితరులు అన్నారు. గురువారం విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. నియోజకవర్గంలో కూటమి నేతలతో కలిసి పనిచేస్తున్నామని అన్నారు. అనేక అంశాల్లో టీడీపీకి ప్రాధాన్యం ఇచ్చామని, తమకేమీ సొంత అజెండా లేదని, కావాలనే కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని చెప్పారు.